వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

# గంజాయి విక్రయిస్తే పీడీయాక్ట్

- సిరిసిల్ల ఎస్పీ అఖిల్‌మహాజన్
- నిందితుడి అరెస్ట్.. 14.59 కిలోల గంజాయి స్వాధీనం

వేములవాడ, జూలై 2: గంజాయి విక్రయిస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ హెచ్చరించారు. గంజాయి విక్రేతను అరెస్ట్ చేసిన అనంతరం వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒడిశాకు చెందిన పుర్తీ బిర్ష ఆ రాష్ట్రంలోని నబరంగాపూరులో కొందరి వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి, అక్కడి నుంచి వేములవాడ, సిరిసిల్లలో కార్మికులే లక్ష్యంగా విక్రయాలు చేపట్టాడు. రోజువారీ తనిఖీల్లో భాగంగా మంగళవారం వేములవాడలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా, పుర్తీ బిర్ష అనుమానాస్పదంగా కనిపించాడు. ఈ మేరకు అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా, గంజాయి విక్రయాలు జరుపుతున్నట్టు ఒప్పుకొన్నాడు. అతడి వద్ద నుంచి 14.59కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశామని ఎస్పీ తెలిపారు. బీర్షపై ఇదివరకు 2016లో ఛత్తీస్‌గఢ్‌లో కూడా కేసు నమోదైనట్టు చెప్పారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, కొనుగోలు చేసినా వెంటనే డయల్ 100కి కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. గంజాయికి అలవాటుపడి మానుకోలేని స్థితిలో ఉన్నవారి కోసం జిల్లాలో డీ ఆడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి వైద్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్ఐలు ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

# స్త్రీనిధి కుంభకోణం బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- వీవో, సీఏ నుంచి ₹30లక్షలు రికవరీ చేయాలి
- బ్యాంకర్ల ఒత్తిడి నుంచి తమను కాపాడాలి
- డీఆర్‌డీఏ కార్యాలయంలో చేగుర్తి ఎస్‌హెచ్‌జీ మహిళల ఆందోళన

డీఆర్‌డీవో కోసం కార్యాలయంలో వేచిచూస్తున్న ఎస్‌హెచ్‌జీ గ్రూపుల సభ్యులు

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 3: స్త్రీనిధి కుంభకోణంపై చేగుర్తి మహిళా సంఘాల మహిళలు ఆందోళనకు దిగారు. తమ పేర రుణాలు తీసుకొని అక్రమాలకు పాల్పడ్డ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బ్యాంకర్ల ఒత్తిళ్ల నుంచి తమను కాపాడాలని వేడుకున్నారు. ఈ మేరకు మంగళవారం కరీంనగర్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తమ గోడును వెల్లబోసుకున్నారు. శ్రీహన్మాన్ గ్రామైక్య సంఘంలో నాలుగేండ్ల క్రితం జరిగిన ఈ కుంభకోణంపై విచారణ జరిపి, ₹35 లక్షల వరకు పక్కదారి పట్టడానికి గ్రామ సీఏ, వీవోను బాధ్యులుగా అధికారులు నిర్ధారించారని చెప్పారు. వీరిలో వీవో శైలజ ₹5లక్షల వరకు చెల్లించి చేతులు దులుపుకోగా, సీఏ స్వరూప మాత్రం మిగతా మొత్తం చెల్లిస్తానని లిఖిత పూర్వకంగా అధికారులకు తెలిపిందని చెబుతున్నారు. కానీ, ఏండ్లు గడుస్తున్నా ఇప్పటివరకు వారి వద్ద నుంచి మిగతా ₹30లక్షలు రికవరీ చేయలేదని ఆరోపించారు. గ్రామంలో 27 సంఘాలుండగా, ఒక్కో సంఘంలోని మహిళ అసలు, మిత్తి కలిపి ₹2లక్షల దాకా చెల్లించాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఏ, వీవో చేసిన మోసానికి తాము ఇబ్బంది పడాల్సి వస్తున్నదని, బ్యాంకు సిబ్బంది తమను కోర్టుకు ఇడుస్తామంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. బాధ్యుల నుంచి డబ్బులు రికవరీ చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. దీనిపై తాడోపేడో తేల్చుకోనిదే తాము ఇక్కడినుంచి కదిలేది లేదంటూ భీష్మించడంతో సిబ్బంది డీఆర్‌డీవోకు సమాచారమిచ్చారు. అయితే డీఆర్‌డీవో అధికారిక సమావేశంలో ఉండడంతో తాను వచ్చే వరకు ఉండాలని సూచించడంతో, వారంతా కార్యాలయంలోనే వేచిచూశారు. రాత్రి ఏడు గంటలకు డీఆర్‌డీవో వారి వద్దకు వచ్చి సమస్య అడిగి తెలుసుకుని, పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. దీంతో, శాంతించిన వారంతా తమ గ్రామానికి వెనుదిరిగారు.

మాట్లాడుతున్న కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

# నెలగడిచినా పెట్టుబడి సాయమేది?

- సీజన్ ప్రారంభమైనా ఇవ్వకుండా కాలయాపన
- 'రైతు భరోసా'పై కుట్రపూరితంగా అభిప్రాయ సేకరణ
- కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

గంభీరావుపేట, జూలై 2: వానకాలం సీజన్ ప్రారంభమై నెలరోజులు గడిచినా ఇప్పటివరకు పెట్టుబడి సాయం ఇవ్వలేదని, ప్రభుత్వం కావాలనే కాలయాపన చేస్తున్నదని కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మండిపడ్డారు. రైతు భరోసా పథకం అమలుపై కుట్రపూరితంగా అభిప్రాయాలు సేకరిస్తున్నదని ఆరోపించారు. గంభీరావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద మంగళవారం సంఘం సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడిచినా రైతుభరోసాపై ఇప్పటివరకు కార్యాచరణ చేపట్టకపోవడం సరికాదన్నారు. రైతులను గోస పెడుతూ.. పెట్టుబడి డబ్బుల కోసం తిరిగి సావుకారుల దగ్గరికిపోయే దుస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని మండిపడ్డారు. రాష్ట్రంలో 97.5శాతం మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నా.. మిగతా రైతుల భూముల వివరాల కోసం అధికారులు గ్రామాల్లో అభిప్రాయ సేకరణ చేపట్టడం కుట్రపూరిత చర్యలేనని ఆరోపించారు. అలాగే వచ్చే ఆగస్టు 14 తేదీతో రైతుబీమా గడువు ముగుస్తుందని, వెంటనే ఆ పథకాన్ని తిరిగి కొనసాగించాలని డిమాండ్ చేశారు. పంటల బీమాపై కూడా దృష్టి సారించాలన్నారు. విలేకరుల సమావేశంలో సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎర్ర రామాంజగౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్లు లింగన్నగారి దయాకర్‌రావు, హన్మంతరెడ్డి, నాయకులు కొమిరిశెట్టి లక్ష్మణ్, గంద్యాడపు రాజు, రాజారాం, మోతె రాజిరెడ్డి, చెవుల మల్లేశం, వెంకటియాదవ్, దుబాసి రాజు, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

## బయో వ్యర్థాలపై బల్దియా కొరడా

కరీంనగర్‌లోని దవాఖానల్లో తనిఖీలు
నిబంధనలు పాటించని హాస్పిటళ్లకు నోటీసులు

కార్పొరేషన్, జూలై 2 : నిబంధనలకు విరుద్ధంగా బయో వ్యర్థాలను నిర్వీర్యం చేస్తున్న దవాఖానలపై కరీంనగర్ నగర పాలక సంస్థ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం నగరంలోని అన్ని హాస్పిటళ్ల యజమాన్యాలతో నగర ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ప్రత్యేకంగా సమావేశమై, బయో వ్యర్థాలను సాధారణ చెత్తలో కలుపవద్దని ఆదేశాలు ఇచ్చారు. అయినా కూడా పలు వైద్యశాలలు నిబంధనలను తుంగలో తొక్కడంపై బల్దియా అధికారులు చర్యలకు సిద్ధమయ్యారు. అందులో భాగంగా మంగళవారం పలు దవాఖానలను తనిఖీ చేశారు. భద్రకాళీ, స్టార్, ఆర్చిడ్, అక్షయ హాస్పిటళ్లు నిబంధనలను పాటించకుండా బయో వ్యర్థాలను సాధారణ చెత్తలోనే కలపడాన్ని గుర్తించి, ఆయా యజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. రెండు మూడు రోజుల్లో జరిమానా విధిస్తామని తెలిపారు. తీరు మార్చుకోకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవడంతోపాటు రిజిస్ట్రేషన్లు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు.

## అరగంటలో ఇంటికి.. అంతలోనే మృత్యుఒడికి..

- ఇసుక ట్రాక్టర్ ఢీకొని భార్య మృతి.. భర్తకు గాయాలు
- బోనాల పండుగకు పుట్టింటికి వెళ్లొస్తుండగా ప్రమాదం
- అందుగులపల్లిలో విషాదం

ఆరె లక్ష్మి (ఫైల్)

పెద్దపల్లి రూరల్, జూలై 2: బోనాల పండుగకు తల్లిగారింటికి వెళ్లొస్తున్న ఆ కూతురు అనుకోని రీతిలో మృత్యుఒడికి చేరింది. మరో అరగంటలో ఇంటికి చేరుకుంటామనేలోగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొని అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలం అందుగులపల్లి గ్రామానికి చెందిన ఆరె సదయ్య, లక్ష్మి (38) దంపతులు. లక్ష్మి తన భర్తతో కలిసి పుట్టినిల్లు అయిన చొప్పదండిలో ఆదివారం నిర్వహించిన బోనాల పండుగకు వెళ్లింది. తిరిగి మంగళవారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో బైక్‌పై దంపతులిద్దరూ తిరుగుపయనం అయ్యారు. మరో అరగంటలో ఇంటికి చేరుకుంటారనేలోగా పెద్దపల్లి మండలం నిట్టూరు వద్ద అతివేగంగా రాంగ్‌రూట్‌లో వస్తున్న ఇసుక ట్రాక్టర్ వీరిని ఢీకొంది. ఈ క్రమంలో ట్రాక్టర్ టైర్ కింద పడిన లక్ష్మి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. సదయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. సదయ్యతోపాటు లక్ష్మి మృతదేహాన్ని పెద్దపల్లిలోని ప్రభుత్వ దవాఖానకు పోలీసులు తరలించారు. సదయ్య సోదరుడు కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

## యూపీఐ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపుల నిలిపివేత

ముకరంపుర, జూలై 2: రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) ఆదేశాల ప్రకారం ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ యూపీఐ సర్వీసు ప్రొవైడర్లైన ఫోన్ పే, జీపే, పేటీఎం, అమెజాన్ బ్యాంకుల ద్వారా విద్యుత్ వినియోగదారుల బిల్లుల చెల్లింపులను నిలిపివేస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులను TG NPDCL వెబ్ సైట్ www.tgnpdcl.in ద్వారా లేదా TG NPDCL మొబైల్ ఆప్, TG NPDCL బిల్ డెస్క్ ద్వారా చెల్లించవచ్చని తెలిపారు. సందేహాల నివృత్తి కోసం కరీంనగర్ సర్కిల్ కంట్రోల్ రూమ్ నంబర్ 9440811444లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

చిగురుమామిడి రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్

# మెగా డీఎస్సీ నిర్వహించాలి

చిగురుమామిడి, జూలై 2: కాంగ్రెస్ ఎన్నికల ముందు హామీలు ఇచ్చి నిరుద్యోగులను మోసం చేసిందని.. అధికారంలోకి వచ్చిన తర్వాత స్పందించడం లేదని బీజేవైఎం నాయకులు మండిపడ్డారు. 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని, గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో నిబంధన ప్రకారం క్వాలిఫై చేయాలని, గ్రూప్-2, 3నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు చిగురుమామిడి రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్ మాట్లాడారు. నిరుద్యోగుల పక్షాన బీజేవైఎం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ అధోగతి పాలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్, నాయకులు అచ్చ రవీందర్, పోలోజు సంతోష్, సదాచారి, బుర్ర శ్రీనివాస్, శ్యామకూర శేఖర్‌రెడ్డి, గూళ్ల సాయికృష్ణ, ప్రతినవ్‌రెడ్డి, ప్రశాంత్, కళ్యాణ్, అశోక్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అదానీ-హిండెన్‌బర్గ్ మధ్యలో కొటక్!

## హిండెన్‌బర్గ్‌కు సెబీ నోటీసులు

- అదానీ స్టాక్స్‌కు సంబంధించిన పెట్టుబడుల్లో నిబంధనల ఉల్లంఘన పేరిట సమన్లు జారీ
- కొటక్ బ్యాంక్‌ను పూర్తిగా రాయక పోవడంపై హిండెన్‌బర్గ్ ప్రశ్న
- మరో వ్యాపారవేత్తను రక్షించే చర్యలంటూ మండిపాటు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): అమెరికా షార్ట్ సెల్లింగ్ రిసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్, అదానీ గ్రూప్‌ల మధ్య ఏడాదిన్నర కాలంగా కొనసాగుతున్న వివాదం కీలక మలుపు తిరిగింది. అదానీ వివాదానికి సంబంధించి ఇండియా మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) హిండెన్‌బర్గ్‌కు గత నెల 27న 46 పేజీల షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం హిండెన్‌బర్గ్ వెల్లడించింది. అదానీ స్టాక్స్‌పై పెట్టుబడుల్లో తాము నిబంధనల్ని ఉల్లంఘించినట్లు సెబీ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిపింది. అయితే, ఈ వివాదంలో కొటక్ బ్యాంక్ ప్రస్తావనను హిండెన్‌బర్గ్ ఉటంకించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

### అసలేం జరిగింది?

అదానీ గ్రూప్ కంపెనీల్లో ఆర్థిక అవకతవకలు జరిగాయంటూ కిందటేడాది జనవరిలో హిండెన్‌బర్గ్ బాంబు పేల్చింది. దీంతో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా క్షీణించాయి. ఈ వివాదంపై దర్యాప్తు చేపడుతున్న సెబీ సుప్రీం కోర్టు ఆదేశాలమేరకు తాజాగా హిండెన్‌బర్గ్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అదానీ స్టాక్స్‌పై పెట్టుబడుల ద్వారా ఆ కంపెనీ 22.25 మిలియన్ డాలర్ల లాభాలు పొందిందన్నది.

### అర్థంలేని నోటీసులు: హిండెన్‌బర్గ్

సెబీ షోకాజ్ నోటీసులను హిండెన్‌బర్గ్ 'అర్థంపర్థం లేనివి'గా కొట్టిపారేసింది. ఉద్దేశపూర్వకంగానే సెబీ ఆ నోటీసులను జారీ చేసిందని మండిపడింది. భారత్‌లోని శక్తిమంతమైన వ్యాపారవేత్తల లోపాలను ఎత్తిచూపే వారిని సెబీ బెదిరింపులకు గురిచేస్తుందని, ఇలాంటి చర్యలకు తాము భయపడబోమని స్పష్టం చేసింది. చిన్న మదుపర్లను రక్షించాల్సిన సెబీ అక్రమాలకు పాల్పడ్డ బడా వ్యాపారవేత్తలకు కొమ్ముకాస్తున్నదని తీవ్రంగా ధ్వజమెత్తింది.

### సెబీ పేర్కొన్న లాభాలేమీ రాలే..

సెబీ ఆరోపించినట్టు అదానీ కంపెనీల షార్ట్ సెల్లింగ్ ప్రక్రియలో తమకు భారీ లాభాలేమీ రాలేదని హిండెన్‌బర్గ్ ఈ సందర్భంగా వెల్లడించింది. అదానీ షేర్ల షార్టింగ్ ద్వారా 4.1 మిలియన్ డాలర్ల స్థూల ఆదాయం పొందినట్టు, అదానీ అమెరికా బాండ్ల షార్ట్ ద్వారా మరో 31 వేల డాలర్లు లభించినట్లు వెల్లడించింది. ఖర్చులు పోను ఏమీ మిగల్లేదన్నది.

### ఆరోపణలు అవాస్తవం: కొటక్

హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై కొటక్ బ్యాంక్ స్పందించింది. ఈ వ్యవహారంతో అసలు సంబంధం లేదని వెల్లడించింది. బ్యాంక్ ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ కింగ్డన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్‌కు హిండన్‌బర్గ్ అసలు క్లయింటే కాదని పేర్కొంది. తమ ఫండ్‌లో హిండెన్‌బర్గ్ అసలు ఇన్వెస్టర్ కూడా కాదని స్పష్టంచేసింది. అయినప్పటికీ సంస్థ షేర్లు 4 శాతం నష్టపోయాయి.

### 'కొటక్' పేరు రాయరెందుకు?

సెబీ నోటీసులపై హిండెన్‌బర్గ్ స్పందిస్తూ 'కొటక్ బ్యాంక్' పేరును ప్రస్తావించడం ఇప్పుడు సంచలనంగా మారింది. బిలియనీర్ ఉదయ్ కొటక్ నేతృత్వంలోని కొటక్ బ్యాంక్ విదేశీగడ్డపై ఓ ఫండ్‌ను ఏర్పాటుచేసినట్లు ఈ సందర్భంగా హిండెన్‌బర్గ్ వెల్లడించింది. దాన్ని ఉపయోగించుకొని కింగ్డన్ క్యాపిటల్ అనే పెట్టుబడి భాగస్వామి ద్వారా అదానీ స్టాక్స్‌ను తాము షార్ట్ చేసినట్లు పేర్కొంది. ఇందులో కొటక్ మహీంద్రా ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ (కేఎంఐఎల్), కేఐవోఎఫ్ సహకారం ఉన్నట్టు తెలిపింది. అయితే, సెబీ తమకు ఇచ్చిన నోటీసుల్లో ఎక్కడా కొటక్ పేరు గానీ, ఆ సంస్థ బోర్డు సభ్యుల ప్రస్తావన గానీ ప్రస్తావించలేదని మండిపడింది. కేఎంఎల్ఐ అంటూ పొడి అక్షరాలను వాడుతూ, కే-ఇండియా అపర్చునిటీస్ ఫండ్ లిమిటెడ్ అంటూ కొటక్ పేరు బయటకు రాకుండా సెబీ జాగ్రత్తలు తీసుకొన్నట్టు విరుచుకుపడింది.

ఫార్మా సదస్సుకు హాజరు కావాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తున్న హెటిరో గ్రూప్ చైర్మన్ పార్థసారథి రెడ్డి, ఇండస్ట్రీ వర్గాలు

## హైటెక్స్‌లో 5న భారతీయ ఔషధ సదస్సు

హైదరాబాద్, జూలై 2: ఈ ఏడాదికిగాను 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వద్ద జరుగనున్నది. ఈ నెల 5-7 తేదీల్లో మూడు రోజులపాటు ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఈ సదస్సును నిర్వహించనున్నది. 'ప్రపంచ శ్రేయస్సు కోసం భారతీయ ఔషధ రంగ పాత్ర' అనే థీమ్‌తో ఈసారి సమావేశాలు జరుగుతున్నాయి. దాదాపు 9,000 మంది నిపుణులు, పరిశోధకులు, వ్యాపార, పారిశ్రామిక వర్గాలు, వివిధ కంపెనీల ప్రతినిధులు, ఎగ్జిబిటర్లు పాల్గొంటారని అంచనా. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా కోరుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ అసోసియేషన్ ఆహ్వానించింది.

### సీఎంతో నోకియా బృందం భేటీ..

నోకియా కంపెనీకి చెందిన ఓ ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. వీరిలో నోకియా గ్లోబల్ హెడ్ మార్టిన్, సేల్స్ హెడ్ మ్యాన్క్, గ్లోబల్ డైరెక్టర్ వెంకట్‌తోపాటు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఉన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతోనూ భేటీ అయ్యారు.

వాణిజ్య



### వెస్పా స్కూటర్ ధర 14.28 లక్షలు

న్యూఢిల్లీ, జూలై 2: దేశీయ మార్కెట్లోకి నయా వెస్పా అందుబాటులోకి వచ్చింది. లిమిటెడ్ ఎడిషన్‌గా విడుదలైన ఈ వెస్పా 946 డ్రాగన్ స్కూటర్ 155 సీసీ సామర్థ్యంతో తీర్చిదిద్దింది. కేవలం అంతర్జాతీయంగా 1,888 యూనిట్లు మాత్రమే విక్రయిస్తున్న ఈ మాడల్ ధర రూ.14,27,999(ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి)గా నిర్ణయించింది. భారత్‌లో ఎన్ని యూనిట్లు విక్రయిస్తున్న విషయాన్ని మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఈ స్కూటర్ కోసం ముందస్తు బుకింగ్‌లు ఆరంభించింది కూడా సంస్థ. డ్యూయల్ చానెల్ ఏబీఎస్, 200 ఎంఎం డిస్క్ బ్రేక్ వంటి ఫీచర్స్‌తో రూపొందించిన ఈ స్కూటర్ యువతకు నచ్చుతుందని పేర్కొంది.

## ఐసీఐసీఐ సఫిరో ఫారెక్స్ కార్డ్

### విదేశీ విద్యార్థుల కోసం తెచ్చిన బ్యాంక్

న్యూఢిల్లీ, జూలై 2: దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్.. మంగళవారం ఓ ప్రీ-పెయిడ్ ఫారెక్స్ కార్డును పరిచయం చేసింది. ఉన్నత విద్యను అభ్యసించేందుకు విదేశాలకు వెళ్తున్న విద్యార్థుల కోసం 'సఫిరో' సిరీస్‌లో ఈ కార్డును బ్యాంక్ తీసుకొచ్చింది. చదువు సంబంధిత ఖర్చులను అధిగమించడానికి అటు విద్యార్థులతోపాటు ఇటు తల్లిదండ్రులకూ తమ ఈ కార్డు ఎంతో సౌకర్యవంతంగా, ప్రయోజనకరంగా ఉంటుందని ఈ సందర్భంగా ఐసీఐసీఐ బ్యాంక్ తెలిపింది. అడ్మిషన్ ఫీజులు, కోర్సు సంబంధిత చెల్లింపులతోపాటు ప్రయాణం, భోజనం, కిరాణా ఇతర రోజువారీ ఖర్చులకు సఫిరో ఫారెక్స్ కార్డు ఉపయోగపడుతుందని ఓ ప్రకటనలో బ్యాంక్ వివరించింది.

- ఈ కార్డు వినియోగదారులు 15 దేశాల కరెన్సీల్లో లావాదేవీలను ఎలాంటి చార్జీలు లేకుండానే చేసుకోవచ్చు.
- కేవలం ఒక్క కరెన్సీకి చెందిన నగదే ఉన్నా.. విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా ప్రయాణించే వెసులుబాటు ఉంటుంది.
- కస్టమర్లకు ఒక ప్రైమరీ కార్డుతోపాటు ఓ రీప్లేస్‌మెంట్ కార్డును ఐసీఐసీఐ ఇస్తుంది.
- ప్రైమరీ కార్డు పోయినప్పుడు/పాడైపోయినప్పుడు ఐమొబైల్ పే, ఇంటర్నెట్ బ్యాంకింగ్ లేదా బ్యాంక్ కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయడం ద్వారానైనా రీప్లేస్‌మెంట్ కార్డును యాక్టివేట్ చేసుకోవచ్చు.

### మాల్యాకు ఎన్బీడబ్ల్యూ

ముంబై, జూలై 2: పరారీ వ్యాపారవేత్త విజయ్ మాల్యాపై తాజాగా మరో నాన్-బెయిలబుల్ వారెంట్ (ఎన్బీడబ్ల్యూ) జారీ అయ్యింది. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐవోబీ)కు రూ.180 కోట్ల రుణం ఎగవేశారన్న కేసులో ముంబైలోని ప్రత్యేక సీబీఐ కోర్టు న్యాయమూర్తి ఎస్పీ నాయక్ నింబాల్కర్ ఎన్బీడబ్ల్యూకు ఆదేశించారు. 2007 నుంచి 2012 మధ్య మాల్యాకు చెందిన కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ ఈ రుణాలను తీసుకున్నది.

### హైదరాబాద్‌లో ఫినోమ్

హైదరాబాద్, జూలై 2: మానవ వనరుల సేవలు అందించే ఫినోమ్.. అమెరికా కేంద్ర స్థానంగా కార్యకలాపాలు అందిస్తున్న టైడీని హస్తగతం చేసుకున్నది. ఆర్థిక వివరాలు మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఈ సందర్భంగా కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శివానంద్ మాట్లాడుతూ.. మానవ వనరులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వచ్చే రెండేండ్లకాలంలో మరో వెయ్యి మంది సిబ్బందిని నియమించుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం సంస్థకు హైదరాబాద్‌లో రెండు, వైజాగ్‌లో ఒక కార్యాలయం ఉండగా, వీటిలో 950 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌తోపాటు వైజాగ్‌లో మరో కార్యాలయాన్ని ఏర్పాటు చేయబోతున్నది.

## టారిఫ్‌లు పెంచినా జియో ప్లాన్లే చౌక

హైదరాబాద్, జూలై 2: దేశీయ టెలికం దిగ్గజాలైన జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు రీచార్జి ప్లాన్ల ధరలను పెంచుతూ టెలికం కస్టమర్లకు షాకిచ్చిన విషయం తెలిసిందే. గతవారంలో జియో తన ప్లాన్ల ధరలను 10 శాతం నుంచి 21 శాతం వరకు పెంచుతూ నిర్ణయం తీసుకోగా.. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు కూడా ప్లాన్ల ధరలను 25 శాతం వరకు సవరించాయి. అయితే చార్జీలు పెంచిన తర్వాత జియో ప్లాన్లే చౌక ధరకు లభిస్తుండటం విశేషం. ఉదాహరణకు రోజుకు 1 జీబీ డాటా, అన్‌లిమిటెడ్ ప్లాన్ ధర రూ.249 కాగా, అదే ఎయిర్‌టెల్/వొడాఫోన్ ఐడియాలు రూ.299కి అందిస్తున్నాయి. అంటే 20 శాతం తక్కువ ధరకే లభిస్తుండటంతో రూ.50 ఆదా కానున్నది. అలాగే రోజుకు 2 జీబీ డాటా, అన్ లిమిటెడ్ కాలింగ్ ప్లాన్ జియో రూ.249కి అందిస్తుండగా, ఎయిర్‌టెల్/వొడాఫోన్ ఐడియాలు రూ.379గా ఉన్నది. జియో కస్టమర్లు 9 శాతం తక్కువ ధరకే ఈ ప్లాన్ లభిస్తుండటం విశేషం. మరోవైపు, మూడు నెలల ప్లాన్ విషయానికి వస్తే 6జీబీ డాటా, అన్ లిమిటెడ్ కాలింగ్ ప్లాన్‌ను జియో రూ.479కి అందిస్తుండగా, అదే ఎయిర్‌టెల్/వొడాఫోన్ ఐడియాలు ఆరు శాతం అధికంగా రూ.509కి అందిస్తున్నాయి. రోజుకు 1.5 జీబీ డాటా ప్లాన్ జియో ధర రూ.799 ఉండగా, అదే పోటీ సంస్థలైన ప్లాన్లు 8 శాతం ఎక్కువగా రూ.859కి అందిస్తున్నాయి.

### సింగరేణి లక్ష్యం 2 లక్షల టన్నుల ఉత్పత్తి

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునేందుకు రోజుకు 2లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి, రవాణా చేయాలని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం అధికారులను ఆదేశించారు. రోజుకు 13 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ (మట్టి)ని తొలగించాలన్నారు. మంగళవారం సింగరేణి భవన్ నుంచి సంస్థ డైరెక్టర్లు, ఏరియా జీఎంలతో కలిసి బొగ్గు ఉత్పత్తి, నూతన ప్రాజెక్టులు, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ వంటి అంశాలపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

# ఫార్మాకు భూముల కొరత!

- ప్రకటించిన మూడు జిల్లాల్లోనూ అడ్డంకులే
- కొత్తగా రెండు ప్రాంతాలు ఎంపిక చేసిన ప్రభుత్వం



హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన ఫార్మా విలేజ్‌లు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇప్పటికే పలు సమస్యలతో సతమతమవుతుండగా.. తాజాగా భూముల కొరత వెంటాడుతున్నది. నల్గొండ, మెదక్, వికారాబాద్ తదితర మూడు జిల్లాల్లో ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా..ఈ మూడు చోట్ల భూముల లభించే పరిస్థితి లేదని ఆయా జిల్లా కలెక్టర్లు తేల్చిచెప్పారు. అయితే జహీరాబాద్‌లో భూసేకరణ అవకాశం ఉండగా, వికారాబాద్‌లో ల్యాండ్ పూలింగ్ ద్వారా ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేయాలని సర్కార్ యోచిస్తున్నది. దీంతో మొదటిదశలో ఈ రెండు ప్రాంతాల్లో ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. సుమారుగా లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో 10 ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని ఈ ఫిబ్రవరిలో జరిగిన బయో ఏషియా సదస్సులో ముఖ్యమంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. ముందుగా వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాలో 1000 నుంచి 2 వేల ఎకరాల స్థలంలో ఈ విలేజ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఫార్మా పరిశ్రమలు కాలుష్యంతో కూడిన రెడ్ జోన్ పరిధిలోకి వస్తాయి కాబట్టి, వీటి ఏర్పాటునకు స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశాలు కూడా ఉండటంతో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నది.

### ఎకోసిస్టం లేకుండా సాధ్యమేనా..

పరిశ్రమల ఏర్పాటునకు సంబంధించి పర్యావరణ వ్యవస్థ(ఎకోసిస్టం) అభివృద్ధి కావడం ఎంతో ముఖ్యం. ఉదాహరణకు రాష్ట్రంలో అనేక దిగ్గజ ఐటీ కంపెనీలు ఉన్నాయి. దీంతో వాటికి అనుబంధంగా పెద్ద సంఖ్యలో చిన్నాచితకా ఐటీ కంపెనీలు ఇక్కడ ఏర్పాటవుతున్నాయి. ఇటువంటి పర్యావరణ వ్యవస్థ లేకుండా పరిశ్రమల మనుగడ సాధ్యంకాదు. ఫార్మా రంగం విషయానికొస్తే, ఇప్పటికే జీడిమెట్ల, బాలానగర్, శామీర్‌పేట్ తదితర ప్రాంతాల్లో ఫార్మా పరిశ్రమలు కొలువుదీరాయి. జీనోమ్ వ్యాలీలో అనేక కంపెనీలు తమ పరిశోధన కేంద్రాలను నెలకొల్పాయి.